సాక్షి కామారెడ్డి

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



పాలకుడిని కాదు..

తాను పాలకుడిని కాదని, ప్రజా సేవకుడినని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 8లో ▸



30 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమం సోమవారం తిరిగి ప్రారంభమైంది. 30 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /12.5

వాతావరణం

ఉదయం శీతలగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు సౌత్‌క్యాంపస్‌లో జాతీయ స్థాయి సదస్సు

భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం వాతావరణ మార్పులపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, సదస్సు కోకన్వీనర్లు కే.రాజేశ్వరి, నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యుయేషన్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరిసర్వోత్తం, కౌన్సిల్ ఫర్ ఎర్త్ లీడర్‌షిప్ అండ్ సస్టైనెబిలిటీ డైరెక్టర్ సాయిభాస్కర్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని కోరారు.

రేపు దివ్యాంగుల క్రీడాపోటీలు

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలో దివ్యాంగుల క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బావయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు పరుగు, షాట్‌పుట్, చెస్, క్యారం, జావెలిన్ త్రో, వీల్‌చైర్, ట్రైసైకిల్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల దివ్యాంగ క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. 15న దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

14న జాబ్ మేళా

కామారెడ్డి క్రైం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ శాఖలో ఆరు యూనిట్ మేనేజర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులని పేర్కొన్నారు. అర్హులైనవారు 14న ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి రావాలని, ఇతర వివరాలకోసం 98482 37987, 76719 74009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారులకు అభినందనలు



కామారెడ్డి క్రైం: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈనెల 8 నుంచి 10 వరకు పాఠశాల స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో అండర్–19 విభాగంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బాలికల జట్టు సత్తా చాటి ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎల్లారెడ్డి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎల్.అఖిల, రజిత, సునీత, ఎస్.అఖిల, బబిత ప్రతిభ కనబరిచారు. ఇందులో ఎల్.అఖిల నాలుగు కిలోమీటర్ల రన్నింగ్‌లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వారందరూ తమ పాఠశాలల ఉపాధ్యాయులు, శిక్షకులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హౌజింగ్‌బోర్డు కాలనీలో బల్దియా స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన బోర్డు



ఇరుకుగా ఉన్న సుభాష్‌రోడ్ ప్రాంతం

కాటిపల్లిపై కోటి ఆశలు

- జిల్లాకేంద్రంలో యథేచ్ఛగా బల్దియా స్థలాల ఆక్రమణ
- అధ్వానంగా పార్కులు, డ్రెయినేజీలు
- విస్తరణకు నోచుకోని రోడ్లు, జంక్షన్‌లు
- ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. రోడ్లు, జంక్షన్‌లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. బల్దియా స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించినా.. ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పురప్రజలు నూతన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సమస్యలను పరిష్కరించి, పట్టణాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారని ఆశిస్తున్నారు.

నిధులున్నా..

పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో రెండు చోట్ల, ఇందిరాచౌక్, రామారెడ్డిరోడ్, కొత్త బస్టాండ్, మున్సిపల్ ఎదురుగా జంక్షన్‌లను విస్తరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి నిధులున్నా పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రధానంగా సిరిసిల్లారోడ్, జన్మభూమిరోడ్, బస్టాండ్ రోడ్, అశోక్‌నగర్‌కాలనీ, పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ వరకు, పెద్దబజార్, సైలానీబాబా కాలనీ తదితర రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. ఈ రోడ్లతో పాటు సుభాష్‌రోడ్, జేపీఎన్, మాయాబజార్, నాజ్ టాకీస్‌రోడ్, స్టేషన్ రోడ్‌లలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది.



సిరిసిల్లరోడ్‌లో ఆక్రమణకు గురైన బల్దియా స్థలం



విస్తరణకు నోచుకోని ఇందిరా చౌక్ ప్రాంతం

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

పట్టణంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పైప్‌లైన్‌ల తవ్వకాలతో రోడ్లు ధ్వంసం అయ్యాయి. నాణ్యత లోపం కారణంగా వేసిన మూణ్నాళ్లకే పలు కాలనీలలో రోడ్లు దెబ్బతిన్నాయి. పట్టణంలో 15 ఏళ్ల క్రితం రూ. 16.50 కోట్లతో చేపట్టిన వాటర్ స్టార్మ్ బడా డ్రెయినేజ్ పనులు పూర్తి కాకపోవడంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. స్టేషన్‌రోడ్, విద్యానగర్, నిజాంసాగర్ చౌరస్తాలో చెరువులను తలపించేలా నీరు నిలుస్తోంది. పలు కాలనీలలో నిర్మించిన మురికికాలువలలో నాణ్యత లేకపోవడంతో దెబ్బతిన్నాయి. సిరిసిల్లరోడ్‌లోని రాజీవ్ పార్క్ కళావిహీనంగా మారింది. మున్సిపల్ ఆఫీస్ పక్కన, రోటరి, స్నేహపూరికాలనీలలో ఉన్న పార్కులు పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని ఇవ్వడం లేవు. పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రకృతి వనాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.



అసంపూర్తిగా ఉన్న సమీకృత మాంస, శాకాహార మార్కెట్ నిర్మాణం

వైకుంఠధామాలలో..

పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీ, జాతీయ రహదారి పక్కన కామారెడ్డి చెరువు వద్ద ఉన్న వైకుంఠధామాల అభివృద్ధికి రూ. 2 కోట్లు వెచ్చించారు. అయినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. స్నానాలకు గదులేకాదు.. నీటి సౌకర్యమూ లేదు. వైకుంఠధామాలలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.. అంతిమ సంస్కారాలు నిర్వహించడం పేదలకు తలకుమించిన భారంగా మారుతోంది. దీనిపై గతంలో 'సాక్షి'లో కథనం ప్రచురితమవడంతో బల్దియా పాలకవర్గం స్పందించి సమావేశం నిర్వహించింది. అంతిమ సంస్కారాల ఖర్చు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. నెలలు గడుస్తున్నా అది అమలుకు నోచుకోవడం లేదు.

ఆక్రమణలకు అడ్డుకట్టేది?

మున్సిపాలిటీ పరిధిలో 200లకు పైగా ఓపెన్ స్థలాలున్నాయి. చాలాచోట్ల కంచెలు లేవు. వీక్లీమార్కెట్ రోడ్‌లోని సర్వే నంబర్ 6లో సర్కారు స్థలం ఆక్రమణకు గురైంది. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పోరా టం చేయడంతో ఆ స్థలం తమదేనని రెవె న్యూ శాఖ ధ్రువీకరించింది. అయినా ఆ స్థలా న్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గంజ్ గేటు ముందు 400 గజాల స్థలాన్ని కబ్జా చేసేందు కు యత్నిస్తున్నారు. హౌజింగ్ బోర్డులో వెయ్యి గజాల స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు బోర్డులు పాతారు. అశోక్‌నగర్, అయ్యప్ప ఆలయం వద్ద, దేవునిపల్లి, స్నేహపురికాలనీ, విద్యానగర్, వీక్లీమార్కెట్ తదితర ప్రాంతాల్లోని సర్కారు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పట్టణంలో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా బహుళ అంతస్తులు, సెల్లార్‌లు నిర్మిస్తున్నా.. అధికారులు నోటీసులకే పరిమితమవుతున్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో..

గాంధీ గంజ్‌లో 2021 లో రూ.7.20 కోట్లతో సమీకృత మాంసం, శాకాహార దుకాణాల నిర్మాణం ప్రారంభించి రెండేళ్లు గడిచినా 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. ఏడాదిగా పనులే సాగడం లేదు. గంజ్‌లో నాలుగేళ్ల క్రితం రూ. 50 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్‌లు వృథాగా ఉంటున్నాయి. రూ. 9.20 కోట్లతో కొత్తబస్టాండ్ నుంచి హౌజింగ్ బోర్డు వరకు చేపట్టిన మురికి కాలువ, ఫుట్‌పాత్ పనులు నిలిచిపోయాయి. సుభాష్ రోడ్‌లో 15 ఏళ్ల క్రితం రూ. 37.50 లక్షలతో నిర్మించిన 46 మాంసం విక్రయ దుకాణాలనుంచి నయా పైసా ఆదాయం రావడం లేదు.

అభివృద్ధే నా లక్ష్యం



పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా. తప్పుచేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. బల్దియాను ప్రక్షాళన చేయాల్సి ఉంది. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు అవినీతిని అంతం చేయడమే నా లక్ష్యం. – వెంకటరమణారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే

'అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దాం'



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

కామారెడ్డి క్రైం: జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అధికారులతో మాట్లాడి జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించి విద్య, వైద్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, ప్రగతిలో ఉన్న పనులు, పెండింగ్ సమస్యలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడానికి అధికారులు చక్కటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్య, వైద్య శాఖల్లో ఖాళీల వివరాలు, ప్రగతిలో ఉన్న పనులు, సమస్యలపై రెండు రోజుల్లోగా నివేదిక అందజేయాలన్నారు. విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్యను అభ్యసించడానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రతి తండా, గ్రామానికి రోడ్డు రవాణా సౌకర్యం సక్రమంగా ఉండాలన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో నివేదికలు సిద్ధం చేసి ఇవ్వాలని ఎమ్మెల్యేకు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్ బాబు, పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీపీవో భాగ్యలక్ష్మి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి క్రైం: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి పనులపై చర్చించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కేవీఆర్

రెగ్యులర్ డ్యూటీల్లోకి యంత్రాంగం

- అసెంబ్లీ ఎన్నికలతో రెండు నెలలు బిజీ
- ఎన్నికలు ముగియడంతో పెండింగ్ పనులపై దృష్టి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలపాటు ఎన్నికల విధుల్లో బిజీబిజీగా గడిపిన యంత్రాంగం.. తిరిగి రెగ్యులర్ డ్యూటీలపై దృష్టి సారించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు నుంచే జిల్లా అధికార యంత్రాంగమంతా అన్ని పనులను పక్కన పెట్టి ఎన్నికల విధుల్లో భాగమయ్యారు. దీంతో దాదాపు రెండు నెలల పాటు ఆయా శాఖలకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈనెల 3న కౌంటింగ్ ప్రక్రియ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం నుంచి అందరూ రెగ్యులర్ విధుల్లో భాగమవుతున్నారు. కలెక్టరేట్‌లో ఎనిమిది వారాలుగా నిలిచిపోయిన ప్రజావాణి తిరిగి సోమవారం ప్రారంభమైంది. ఇందులో ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజావాణి ఫిర్యాదులపై సమీక్ష కూడా జరిగింది. అలాగే ఎన్నికలతో ఆయా శాఖల్లో పేరుకుపోయిన ఫైళ్లను దుమ్ముదులిపే పనుల్లో అధికారులు, సిబ్బంది మునిగిపోయారు.

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కొత్త ప్రభుత్వం ప్రాధాన్యతాంశాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో జిల్లా అధికారులు వాటిని ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది రెగ్యులర్ డ్యూటీలకు హాజరవుతుండడంతో ఆయా శాఖల కార్యాలయాలు కళకళలాడుతున్నాయి.

ఏడాదంతా ఎన్నికలే..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా వచ్చే ఏడాదంతా ఎన్నికలే ఉండే అవకాశాలున్నాయి. ముందుగా పంచాయతీ ఎన్నికలు తర్వాత పార్లమెంటు ఎన్నికలు, మున్సిపల్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు వరుసగా రానున్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రాకముందే పెండింగ్ పనులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించారు.

ఫిబ్రవరి 1 తో గ్రామ పంచాయతీ పాలక వర్గాల కాలపరిమితి ముగియనుంది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఆయా జిల్లాల అధికారుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఒకవేళ ఎన్నికలను ఆపాలని ఆదేశాలిస్తే తప్ప వాయిదా పడే అవకాశం లేదు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే జనవరి నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికి నెల రోజుల ముందు నుంచే అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయకపోతే ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మరింత సమయం వేచిచూడాల్సి ఉంటుంది.

షబ్బీర్ అలీపై ఆరోపణలు అవాస్తవం

కామారెడ్డి టౌన్: మాజీ మంత్రి షబ్బీర్ అలీపై ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తమని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 18 ఏళ్లుగా విద్యుత్ శాఖలో అవినీతి జరిగితే ఇన్నేళ్లు ఎందుకు ఊరుకున్నారో చెప్పాలన్నారు. మైనారిటీ విభాగంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా చేసిన వ్యక్తికి మూడేళ్లుగా వేతనం రావడం లేదని, ఆయన షబ్బీర్ అలీ వద్ద పనిచేస్తున్నారని పేర్కొన్నారు. షబ్బీర్ అలీపై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. డిగ్రీ కళాశాల భూముల విషయంలో ఎవరు అవినీతికి పాల్పడ్డారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డిలో నిలిచిన భూముల రిజిస్ట్రేషన్లు

- పది రోజులుగా డిజిటల్ కీ సమస్య
- ఇబ్బందిపడుతున్న రైతులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి తహసీల్ కార్యాలయంలో పది రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందిపడుతున్నారు. కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయాల్సిన అధికారి డిజిటల్ కీ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. సోమవారం ఉదయం డిజిటల్ కీ వస్తుందని అధికారులు పేర్కొనడంతో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి చూశారు. మధ్యాహ్నం మూడు గంటలు దాటినా అధికారులు రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీశారు. ఆపరేటర్ అందుబాటులో లేదని, ఆపరేటర్ రాగానే రిజిస్ట్రేషన్లు చేస్తామని పేర్కొనడంతో జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల మండలాల్లో అధికారుల పనితీరు ఎలా ఉంటుందోనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాగేలా చూడాలని కోరారు.



కామారెడ్డి తహసీల్ కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

కామారెడ్డి క్రైం: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా ఓటుహక్కుకోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ని బంధనల ప్రకారం నోటీసులు జారీచేసి మరణించిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాల న్నారు. పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలతో నివేదిక అందించాలని సూచించారు. ఓటరు జాబితా రూపొందించడంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలని, 1,500 మంది కంటే ఓటర్లు ఎక్కువగా ఉన్నచోట అదనపు కేంద్రాల ఏర్పాటునకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తే చర్యలు



మాక్లూర్: ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హెచ్చరించారు. ఇంత కాలం అధికారులను బెదిరించి దొడ్డిదారిన అనుమతులు తెచ్చుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కంకర, మొరం క్వారీ యజమానులు ఇక నుంచి పద్ధతి మార్చుకోవాలన్నారు. సోమవారం మండలంలోని మాదాపూర్‌లో ఉన్న కంకర క్వారీలను ఆయన పరిశీలించారు. అనుమతులు ఉన్నాయా లేదా అనేది క్వారీ యజమానులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జీఎస్టీ చెల్లిస్తున్నారా లేదా అనేది కూడా ఆరా తీయాలని మైన్స్ ఏడీ సత్యనారాయణను ఆదేశించారు. క్వారీలకు అనుమతి ఎన్ని ఎకరాల్లో ఉంది, తవ్వకాలు ఎక్కడెక్కడ జరుపుతున్నారు అనేది కూడా తెలుసుకోవాలని ఆదేశించారు. అప్పటి వరకు క్వారీలను సీజ్ చేయాలని మైన్స్ ఏడీకి సూచించారు. క్వారీల నుంచి రోడ్లను ఎలా వేశారని ప్రశ్నించారు. రైతులను బెదిరించి రోడ్లు వేశారా అని ఆరా తీశారు. మాదాపూర్, చిన్నాపూర్ ప్రాంతాల్లో కంకర, మొరం క్వారీలు అక్రమంగానే కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని తెలిపారు. అక్రమాలు బయట పడితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఆర్ఐ షఫీ, నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, పాలేం రాజు, అనిల్‌కుమార్, వినోద్, మెదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

సిరికొండ: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికై నట్లు పీఈటీ నాగేష్ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో కామారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రామ్‌చరణ్, నితిన్, షాహెద్, భరత్, శివశాంత్, సిద్దు, జాగృతి, అమ్ములు, అఖిల, రసజ్ఞ, జస్మిత, శ్రీనిధి, అక్షయ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 16 నుంచి 18 వరకు కామారెడ్డిలో జరుగుతాయని పేర్కొనారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రాములు, సర్పంచ్ బాలమణిమల్లేష్, ఎంపీటీసీ లింగం, ఎస్‌ఎంసీ చైర్మన్ లావణ్య, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విశాఖ గంగారెడ్డి, రమణ అభినందించారు.

నేడు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎన్నికలు

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంతోపాటు ఎన్నికలను మంగళవారం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు వి ద్యానగర్‌లోని రోటరీ ఆడిటోరియంలో ఎ న్నికలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడి, కేపీ అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో సోమవారం 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. వివిధ కేటగిరిల వారీగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వ్యాఫ్టి', అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించింది.

SAKSHI MATH BEE 2023-24 SAKSHI SPELL Bee 2023-24



నగరంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఎంతో ఉపయోగం



సాక్షి స్పెల్ బీ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పరీక్ష కోసం కొద్ది రోజులుగా ప్రిపేరయ్యాను. పరీక్ష కోసం మా ఉపాధ్యాయులు సన్నద్ధం చేశారు.

– కృతజ్ఞ, ఐదో తరగతి

మళ్లీ పరీక్షకు హాజరవుతా..



సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షకు హాజరు కావడం హ్యాపీగా ఉంది. వచ్చే ఏడాది నిర్వహించే పరీక్షకు మళ్లీ హాజరవుతా. దీనికి ముందు నుంచే ప్రిపేర్ అవుతా.

– ఇందుమతి, ఐదో తరగతి

నమ్మకం కలిగింది



ఈ పరీక్షతో నాకు ఎంతో నమ్మకం కలిగింది. ఇతర పరీక్షలు బాగా రాయగలుగుతాననే నమ్మకం ఏర్పడింది. గత కొన్ని రోజులుగా పరీక్షకు సన్నద్ధమవుతున్నాను. పరీక్ష బాగా రాశాను.

– విఘ్నేష్, ఐదో తరగతి

పోటీ పరీక్షల మాదిరిగా ఉంది



సాక్షి నిర్వహించిన ఈ పరీక్షతో పోటీ పరీక్షలను కూడా రాయగలననే నమ్మకం ఏర్పడింది. నా తల్లిదండ్రులు కూడా ఎంతో ప్రోత్సాహం అందించారు. మంచి అనుభవం ఏర్పడింది.

– అయాన్‌ఖాన్, పదో తరగతి

ప్రతిభ వెలుగులోకి..



సాక్షి నిర్వహించిన ఈ పరీక్షలతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఇలాంటి పరీక్షలు మళ్లీ నిర్వహించాలి. విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపయోగపడుతుంది.

– సాత్విక్, ఎనిమిదో తరగతి

భయం పోయింది



ఇంగ్లిష్ సబ్జెక్టుపై లోతైన అవగాహన కోసం స్పెల్ బీ పరీక్ష దోహదపడింది. నేను ఇంగ్లిష్ ఎలా చదవాలో తెలిసింది. గత ఏడాది కూడా ఈ పరీక్షకు హాజరయ్యాను. ఇంగ్లిష్ భాషపై ఉన్న భయం పూర్తిగాపోయింది.

– అనన్య, ఎనిమిదో తరగతి

లెక్కలు ఎలా చేయాలో తెలిసింది



నేను అన్ని సబ్జెక్టులు బాగానే చదువుతాను. కానీ గణితం బాగా భయంగా ఉండేది. సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్ష రాసిన తర్వాత భయం పోయింది. లెక్కలు ఏవిధంగా చేయాలో తెలిసింది.

– షేక్ యూసుఫ్, ఎనిమిదో తరగతి

పాలకుడిని కాదు.. ప్రజల సేవకుడిని..



ఎల్లారెడ్డిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

• ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: తాను ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల పాలకుడిని కాదని, సేవకుడినని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ప్రజల వద్దకు పాలన కార్యక్రమం నిర్వహిస్తానని చెప్పారు. ప్రతి మండలంలో 15 రోజులకొకసారి అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నారు. చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో చాలా మంది చిరుద్యోగులకు ఉపయోగం ఉంటుందన్నారు. ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామన్నారు.

అధికారులతో సమీక్ష

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, విద్యాశాఖ, అటవీశాఖ అధికారులతో విడివిడిగా సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఎంపీడీవోలు లక్ష్మీ, రాజ్‌వీర్, ఎంపీవో ప్రకాష్, ఎఫ్ఆర్‌వో ఓంకార్ తదితరులున్నారు.

మొక్కు తీర్చుకున్న నడిమితండా సర్పంచ్

రాజంపేట: ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్‌మోహన్ రావు గెలవాలని తిరుపతి వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు నడిమితండా సర్పంచ్ వినోద్ కుమార్ తెలిపారు. మదన్‌మోహన్‌రావు గెలవడంతో తిరుపతి వెళ్లి మొక్కు తీర్చుకునట్లు చెప్పారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి ప్రసాదం అందజేసి, చేతికి కంకణం కట్టారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శివ



బచ్చనబోయిన శివ

నిజామాబాద్‌రూరల్: ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు బచ్చనబోయిన శివ ఎన్నికయ్యారు. ఈ నెల 7 నుంచి 10 వరకు ఢిల్లీలో 69వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శివను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతానన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి



కరుణాకర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ సామల కరుణాకర్‌రెడ్డి నియమిలయ్యారు. ఢిల్లీలో జరిగిన జాతీయ మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి, ప్రాంత సంఘటన మంత్రి కరుణాకర్‌కు కరుణాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు



నగరంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

సుభాష్‌నగర్: జిల్లాలోని గ్యాస్ సిలిండర్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులు తీస్తున్నారు. ఆధార్ లింకేజీ కోసం ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. కానీ కొందరు ఈవిషయంలో అపోహ పడుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ–కేవైసీ చేయించుకుంటేనే గ్యాస్ సిలిండర్ రూ.500కే వస్తుందని వినియోగదారులు ఏజెన్సీల వద్దకు బారులు తీస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఈ–కేవైసీకి గడువు ఇంకా ఉందని వినియోగదారులను సముదాయిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. నగరంలో పలుచోట్ల పోలీస్‌బందోబస్తు నడుమ ఈ–కేవైసీ చేస్తుండటం గమనార్హం. కాగా ఉజ్వల యోజన కింద గ్యాస్ సిలిండర్ పొందిన వినియోగదారులు డిసెంబర్ 31వరకు ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. ఈ గడువును ఇంకా పెంచే అవకాశం కూడా ఉంది. సాధారణ గ్యాస్ సిలిండర్ వినియోగదారులు మాత్రం మార్చి 31వరకూ ఎప్పుడైనా ఈ–కేవైసీ చేయించుకోవచ్చని ప్రకటించినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందనే అపోహతో ప్రజలు ఏజెన్సీల వద్దకు పరుగెత్తుతున్నారు. చాలా మంది పేదలు పనులు వదిలేసి భారీ క్యూలైన్లలో నిల్చొని ఈ–కేవైసీ చేయించుకుంటున్నారు. ఈ–కేవైసీ చేయించుకున్న వారు రూ.500కే సిలిండర్ ఇవ్వాలని అడుగుతుండటంతో ఏజెన్సీ నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఇదే విషయమై పౌరసరఫరాలశాఖ అధికారుల వివరణ కోరగా, ఈ–కేవైసీకి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాలేదని, గడువు విషయం తెలియదని తెలిపారు.

పెండింగ్ ఫిర్యాదులు పరిష్కరించాలి



నిజామాబాద్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్: ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 38 ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక విరామం అనంతరం సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాగా ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై చేపట్టిన చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

ల్యాండ్ రికార్డ్స్ ఏడీపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: వేల్పూర్ మండలంలోని శాయంపేట్ శివారులోగల 60 నుంచి 74 సర్వేనెంబర్లలోని తనకు చెందిన 29 ఎకరాల భూమి సరిహద్దులు గుర్తించాలని కొండి లక్ష్మి కోరారు. ఈ మేరకు ఆమె ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులును పిలిచారు. కలెక్టర్ ఎదుటే ఏడీపై లక్ష్మి ఆరోపణలు చేశారు. హద్దులు గుర్తించేందుకు రూ.ఐదు లక్షలు లంచం డిమాండ్ చేశారని ఆరోపించింది. ఆమె మాట్లాడుతూ తన భూమిలో ఏడు ఎకరాలను కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమికి సంబంధించి హద్దులు గుర్తించాలని నాలుగేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులకు నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయని ఆరోపించారు.

కామారెడ్డిలో 30 ఫిర్యాదులు



కామారెడ్డిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: శాఖల వారిగా అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. దాదాపు 8 వారాల అనంతరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ పాటిల్, అధికారులు ఫిర్యాదుదారుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 30 ఫిర్యాదులు రాగా వాటిలో 16 రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలవే కావడం గమనార్హం. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఆర్‌డీవో సాయన్న, ఏవో మన్సూర్ అహ్మద్, తహసీల్దార్ సాయి భుజంగ రావు, డీపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తాడ్వాయి మండలంలో ఐకేపీ సమన్వయకర్తగా పనిచేసిన సాయిలు ఇటీవల మృతి చెందగా ఉద్యోగుల బీమా కింద మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును కలెక్టర్ మృతుడి భార్య సవితకు అందజేశారు.

మానవ హక్కులపై అవగాహన



ఖలీల్‌వాడి: మానవ హక్కుల పరిరక్షణ కోసం ఎంతో మంది కృషి చేస్తున్న ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయని రిటైర్డ్ జడ్జి రాంచందర్ అన్నారు. ఆమెన్ జస్టిస్ ఫర్ సిటిజెన్స్ హ్యూమన్ రైట్స్ అండ్ వరల్డ్ సోషల్ పీస్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఉల్లెంగ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద కార్యాలయంలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్గం విజయ్ కుమార్ పటేల్, అమీర్ హుస్సేన్, ఆకుల నవీన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వైద్యురాలు మృతి

నిజామాబాద్‌రూరల్: మాధవనగర్ శివారులోని ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రిలో మత్తుమందు వైద్యురాలిగా పనిచేస్తున్న పైల సౌమ్య(28) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. వ్యక్తిగత కారణాలతో తనకు తానే మత్తు ఇంజెక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. సౌమ్య తండ్రి శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న జీపు



ఎడపల్లి: మండలంలోని ఎంఎస్‌సీ ఫారం వద్ద సోమవారం ట్రాక్టర్ ట్రాలీని జీపు వెనక నుంచి ఢీకొంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ కొట్టించడానికి యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఒక మహిళకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



రామారెడ్డి: అనారోగ్య సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్కాకుల మానస(27)కు ఇద్దరు కుమారులు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. మానస కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. అంతేగాకుండా గతంలో సిజేరియన్ అయిన కుట్లు నొప్పిగా ఉన్నాయని భర్త రవితో చెప్పింది. ఆస్పత్రికి వెళ్దామని చెప్పి రవి బయటకు వెళ్లాడు. అనంతరం ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

కుటుంబ తగాదాలతో ఒకరు..

భిక్కనూరు: మండల కేంద్రంలో ఒక్కరూ కుటుంబ తగాదాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ సోమవారం తెలిపారు. భిక్కనూరుకు చెందిన బత్తిని వెంకటేశ్(26) బ్యాండ్ మేళం వాయిస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య తిరుమల, ఇద్దరూ కుమారులు ఉన్నారు. వెంకటేశ్‌కు మూడు నెలల క్రితం కుమారుడు జన్మించడంతో ఆయన భార్య తిరుమల తల్లిగారి గ్రామమైన జగిత్యాల జిల్లా చెర్ల కొండాపూర్‌లో ఉంటుంది. వెంకటేశ్‌కు తన పినతల్లి మంజులతో తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వెంకటేశ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ధర్పల్లి: అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి ధర్పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శిరస్సు విజయ్ (38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్‌కి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యల తోపాటు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో జీవితం విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నిరీక్షణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వడ్డేపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అశోక్ సింగ్ (55) ఆదివారం రాత్రి ఠాణాకలాన్ శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, మృతుడి కొడుకు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని జెండాగల్లీకి చెందిన హారిక అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. శనివారం ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాలేదు. ఆస్పత్రిలో వాకబు చేయగా రాలేదని చెప్పారు. పలుచోట్ల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో హారిక భర్త వినయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.